క్లుప్తంగా

వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సెబ్ సీఐ గోపీకృష్ణ, ఎస్ఐ శివ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం వేలం నిర్వహించారు. బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో వేలం వేశారు. తొమ్మిది వాహనాలను ప్రభుత్వం రూ. 1,34,500 నిర్ణయించగా పాటదారులు రూ.1,69,000లు వేలం పాడగా జీఎస్టీ రూ. 30,420 మొత్తం రూ. 1,99,420 వచ్చినట్లు వారు తెలిపారు. రెండు కార్లు వేలం వేయగా ఎవరూ తీసుకోలేదన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

బ్రహ్మసముద్రం: మండలంలోని సంతేకొండాపురం పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనులను శనివారం ఎంపీడీఓ వెంకటనాయుడు పరిశీలించారు. ఎండాకాలంలో పని ప్రదేశంలో కూలీలకు అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అప్పస్వామి నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మంగారి ఆరాధన రథోత్సవం



వీరబ్రహేంద్రస్వామి మూలవిరాట్

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విరుపాక్షేశ్వర స్వామి ఆశ్రమంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మం గారి మఠంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఆరాధన రథోత్సవ పూజలను నిర్వహించనున్నారు. ఆశ్రమ పీఠాధిపతి ఈశ్వర స్వామి ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, నారాయణసేవ, భజన కార్యక్రమాలు కొనసాగిస్తారు. సోమవారం ఉదయం గణపతి పూజ, మధ్యాహ్నం 3.45 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు.

4 నుంచి నరసింహ స్వామి జయంత్యుత్సవాలు



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

కళ్యాణదుర్గం: కోట వీధిలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలను మే 4 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 4వ తేదీ ఉదయం 7 గంటలకు మూల విగ్రహానికి అభిషేకం, 10 గంటలకు కల్యాణోత్సవం, 5వ తేదీ ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. అభిషేకానికి రూ.200, కల్యాణోత్సవానికి రూ.600 చొప్పున పూజా కార్యక్రమాలకు ధరలు నిర్ణయించామన్నారు. పూజల్లో పాల్గొనే వారు దేవాలయ కార్యదర్శి జి.రమేష్, (8328044857), అర్చకుడు కె.ప్రదీప్ శర్మ (9573097540)ను సంప్రదించాలన్నారు.

ఘనంగా జలాభిషేకం



గంగను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ సోమనాథేశ్వరస్వామి, వీరభద్రేశ్వరస్వామి ఆలయాల వద్ద నూతనంగా నిర్మించిన గోపురాలకు కలశ ప్రతిష్టాపన కార్యక్రమంలో గంగ జలాన్ని ఘనంగా ఊరేగించారు. గోపురాలకు కలశ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో యన్నప్ప తాత దేవాలయం వద్ద పవిత్ర జలాన్ని మహిళలే 101 కలశాలు, వీరభద్రుడి వేషధారణ, నందికోల్లు, డ్రమ్స్‌లు కొట్టుకుంటూ గంగజలాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామికి జలాభిషేకం, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అలాగే ఆదివారం తెల్లవారుజామున ఆలయాల గోపురాలకు కలశ ప్రతిష్టాపన చేపట్టనున్నారు.

గాలీవాన బీభత్సం

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, బేలోడు, నేత్రపల్లి, భూపసముద్రం, ఎర్రంపల్లి, దేవరెడ్డిపల్లి, మారెంపల్లి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో నాలుగు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

'దుర్గం'లో మోస్తరు వర్షం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో శుక్రవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరైన ప్రజానీకానికి వర్షం రాకతో కాస్త ఉపశమనం లభించినట్లయింది.

మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

- 'గడప గడప'లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసి మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలుద్దామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మేపరాల గ్రామంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషాతో కలసి విప్ శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే లంచాలు, పడిగాపులు , నాయకుల వద్ద వేడుకోలు ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పథకాలు అందజేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ప్రజాసంక్షేమం పట్టని టీడీపీ నాయకులు ఇప్పుడేమో అధికార దాహంతో వంచనమాటలు చెబుతున్నారన్నారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే 420 చంద్రబాబు ఇన్నేళ్లలో ప్రజా సంక్షేమం గురించి ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బాబు అండ్ కో కు ప్రజలు గుర్తుకొస్తారన్నారు. ఇక మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కూడా తన బాస్ ను అనుకరిస్తూ సెల్ఫీ సుందరాంగుడయ్యాడని ఎద్దేవా చేశారు. ఏరోజు కూడా రాయదుర్గం అభివృద్ధి, ప్రజా సమస్యలు పట్టని కాలవ ఏదో పొడిచేసినట్టు తన పచ్చ మీడియాలో గొప్పలు చెప్పుకుంటున్నాడని దెప్పిపొడిచారు. అలాంటి నీచ, నికృష్ట నాయకులను నమ్మి మోసపోవద్దని , మంచిపాలన అందిస్తున్న మనసున్న మారాజుకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, రహిమాన్, నాగేంద్ర, వెంకటేశ్వరస్వామి, యు.లింగారెడ్డి, గంగన్న, నాగరాజు, మాజీ సర్పంచ్ శంకర్, డీలర్ వెంకటస్వామి, రామన్న, మారెన్న, సచివాలయాల కన్వీనర్ ధనుంజయ, మండల మాజీ ఉపాధ్యక్షుడు బాబులు, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ నాగమణి, ఈఓపీఆర్డీ రఘురామారావు, ఏపీఓ నీరజ, హెచ్ఓ దస్తగిరి, ఏఈ బాలచంద్ర, పీఆర్ జేఈ మునయ్య పాల్గొన్నారు.

సమస్యకు చావొక్కటే పరిష్కారం కాదు..

రాయదుర్గం: సమస్యకు చావొక్కటే పరిష్కారం కాదని, దాన్ని తట్టుకుని ముందుకు నడిచిన వారే అన్నింటా విజయం సాధిస్తారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో శనివారం పాఠశాల 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.. పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రాన ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం పిరికి తనమన్నారు. మరో అవకాశం మనముందుందనే భావన మీలో కలిగినప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే విద్యావ్యవస్థలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. అనంతరం నేషనల్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ హేమలత, కౌన్సిలర్ గౌని లావణ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఎంఈఓ నాగమణి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు డిష్ గోవిందు, బండి అజయ్, ఫకృద్దీన్, వార్డు ఇన్‌చార్జులు వాల్మీకి హనుమంతరాయుడు, గౌని శ్రీరామిరెడ్డి, గోరంట్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా అజెండా అంశాలు ఆమోదం



కౌన్సిల్ మీట్‌లో సమస్యలు ప్రస్తావిస్తున్న కౌన్సిలర్ పద్మజ

రాయదుర్గంటౌన్: సమస్యలను అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అజెండాలోని అంశాలను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించగా ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జీరో అవర్స్‌లో పలువురు కౌన్సిలర్లు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. 23వ వార్డు కౌన్సిలర్ పద్మజ మాట్లాడుతూ పైప్‌లైన్ మరమ్మతుల సమయంలో పట్టణంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంటోందని, అదనపు ట్యాంకర్ల ద్వారా సమస్యను పరిష్కరించాలన్నారు. 28వ వార్డు కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద అధికంగా ఉన్నందున ఫాగింగ్ నిర్వహించాలన్నారు. 1వ వార్డు కౌన్సిలర్ నాగవేణి మాట్లాడుతూ గౌడ ఇందిరమ్మ లేఅవుట్‌లో మూడునీటి ట్యాంకుల వద్ద లీకేజీని అరికట్టాలన్నారు. కౌన్సిలర్ బండి అజయ్ మాట్లాడుతూ సచివాలయ అమెనిటీస్ తరుచూ నీటి క్లోరినేషన్‌ను పరిశీలించాలన్నారు. అలాగే వార్డు పరిధిలో టీచర్స్ కాలనీలో నీటి మోటర్‌కు కేబుల్ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, మేనేజర్ కిషోర్, ఏఈ గోపీనాథ్, అకౌంటెంట్ ఈశ్వర్ పాల్గొన్నారు.

పిల్లల చదువుపై పెద్దలు దృష్టి పెట్టాలి

కళ్యాణదుర్గం: పిల్లల చదువుపై కుటుంబంలో పెద్దలు దృష్టి పెట్టాలని ఎంఈఓ విజయకుమారి సూచించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక ఏపీ మోడల్ పాఠశాల, నార్త్ ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓ విజయకుమారి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల చదువు కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన తదితర పథకాలతో ఉన్నత విద్యను ప్రోత్సహిస్తోందన్నారు. వేసవిలో ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ' వుయ్ లవ్ రీడింగ్ ' కార్యక్రమాన్ని చేపట్టనుందన్నారు. ఆయా కార్యక్రమాలలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, హనుమన్న, నాగమణి, నార్త్ పాఠశాల హెచ్ఎం గాయిత్రిభాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే సీఎం లక్ష్యం

డి హీరేహాళ్(రాయదుర్గం)/వజ్రకరూరు: నిరుపేదలందరికీ ఇళ్లు కట్టించాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని ఎంపీడీఓ భాస్కర్ బాబు అన్నారు. డి హీరేహాళ్ మండల కేంద్రంలోని కాలమ్మదేవి ఆలయ ప్రాంగణంలో శనివారం సర్పంచ్ లక్ష్మి, జెడ్పీటీసీ హసీనాభానుతో కలసి ఆయన హౌసింగ్ డేపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్థలంతో పాటు ఇల్లు మంజూరైన లబ్ధిదారులంతా సత్వరం నిర్మాణాలకు ముందుకు రావాలన్నారు. ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి కావాల్సిన మౌలిక సౌకర్యాలు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రుద్రమ్మ, లింగప్ప, సూజీ మహేష్, నాయకులు సింగాడి మంజునాథ, శివారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో వైస్ ఎంపీపీ సుశీలారాణి, సర్పంచు మోనాలిసా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ద్రాక్షాయిణి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ట్రాన్స్ కో ఏఈ చంద్రశేఖర్, ఏపీఎం గుణశ్యాం తదితరులు పర్యటించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

ప్రతి ఇంటా 'జగనన్నే మా భవిష్యత్' నినాదం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: ప్రతి ఇంటా జగనన్నే మా భవిష్యత్తు నినాదం వినబడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు ముగింపు సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, రాష్ట్ర నృత్య, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, నియోజకవర్గ పార్టీ సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, పెరుగు తిమ్మరాజు, రాము, గంగాధర, చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలబెట్టడం మంత్రి పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రతి గడపలో పార్టీని ఆదరిస్తూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను స్వాగతిస్తూ ప్రజలు ఆశీర్వదించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశాలకు ప్రజాప్రతినిధులు హాజరుకావాలి



బేలోడు పంచాయతీకి అవార్డును ప్రదానం చేస్తున్న అధికారులు

గుమ్మఘట్ట: మండల సర్వసభ్యసమావేశాలకు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవాని అధ్యక్షతన శనివారం సాధరణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సమావేశాలకు హాజరై ప్రజల వాణిని వినిపించి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా 17 గ్రామాలకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. రైతుల కోసం బీటీపీ ఆయకట్టు కింద గడువు ముగిసిన తరువాత మరో 15 రోజుల పాటు నీటిని వదలాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. అనంతరం గ్రామీణులకు ఉత్తమ సేవలందించినందుకు తొమ్మిది గ్రామ పంచాయతీలకు 18 అవార్డులను ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ రాజ్ డీఈ రాంమోహన్‌రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, వైస్ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, జయమ్మ, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఏపీఓ సురేశ్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కోనాపురం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

విడపనకల్లు: సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న సమావేశ భవనంలో ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో విడపనకల్లు, గడేకల్లు, వి.కొత్తకోట, డొనేకల్లు, వేల్పుమడుగు గ్రామాల్లోని ఎస్సీ, బీసీ కాలనీలో విద్యుత్ లైన్లు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నా పట్టించుకోవడంలేదని ఏఈ సత్యంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ,ఆర్‌డబ్ల్యూఎస్, పశుపోషణ తదితర శాఖాధికారులు నివేదికను వివరించారు. ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు మాట్లాడుతూ నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ శ్రీరాములు, ఏఓ పెన్నయ్య, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఉరవకొండ/కళ్యాణదుర్గం/రాయదుర్గంటౌన్: ఆరో తరగతిలోకి ప్రవేశించడానికి 'నవోదయ' నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 192 మంది విద్యార్థులకు గాను 18 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 153 మందికి గాను 14 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ ఈశ్వరప్ప తెలిపారు. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏ సెంటర్‌లో 240 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 25 మంది, అదే పాఠశాలలోని బీ సెంటర్‌లో 216 మందికి గానూ 26 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 207 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 30 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 216 మందికి గాను 19 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 216 మందికి గాను 20 మంది, రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 194 మందికి గాను 21 మంది గైర్హాజరైనట్లు హెచ్ఎంలు రమాదేవి, వెంకటేష్ బాబు, చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు.

మే నెలాఖరులోగా పనులు పూర్తి చేయండి



కూడేరులో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ భాగ్యరాజు

ఉరవకొండ(కూడేరు): కూడేరు మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులు మే నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజు అధికారులను ఆదేశించారు. శనివారం కూడేరులోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నాడు–నేడు కింద చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఎస్ఈ పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ రూ.80 లక్షల వ్యయంతో చేపడుతున్న అదనపు గదుల పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా చూసుకోవాలన్నారు. ముందు భాగాన మంచి డిజైన్‌తో నిర్మాణం చేయించి భవనం ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని ఏఈ శ్రీనివాసులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజారావు పాల్గొన్నారు.


కూడేరులో లేగదూడల ప్రదర్శన

ఉరవకొండ(కూడేరు): కూడేరు మండలంలోని కడదరకుంట గ్రామంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం వాడకంతో 90 శాతం ఆడదూడలు పుట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. లింగ నిర్ధారిత వీర్యం రెండు ఇంజక్షన్లకు రూ.1,350 అవుతుందని సబ్సిడీ రూ.850 పోను పాడి రైతులు రూ.500 చెల్లించాలన్నారు. అనంతరం ముర్రుపాల ప్రాముఖ్యత, నట్టల నివారణ మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు ధనంజయ, సుశీల, ప్రమీలమ్మ, రాఘవ పాల్గొన్నారు.


గడప గడపలో సంక్షేమ ఫలాలు

కళ్యాణదుర్గం/ఉరవకొండ/బెళుగుప్ప/బొమ్మనహాళ్/వజ్రకరూరు: ప్రతి ఇంట్లో సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. కళ్యాణదుర్గం మండలంలోని యర్రంపల్లిలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మారుతమ్మ, సచివాలయ కన్వీనర్లు ఆంజనేయులు, అర్చన, పార్టీ సీనియర్ నాయకులు జయరాములు, వెంకటేశులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన పథకాలపై ఆరా తీశారు. జగనన్నే మా నమ్మకం అంటూ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అతికించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, సంతోష్, మల్లక్క, రమేష్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

- ఉరవకొండ పట్టణంలో జగనన్నే మా భవిష్యత్ వంద శాతం విజయవంతంగా ముగిసింది. సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లు ఆయా సచివాలయ పరిధిలో 90 శాతం ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం చివరి రోజు ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మాజీ ఎంపీపీ ఏసీఎం త్రిస్వామి ఆధ్వర్యంలో రంగావీధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఆసీఫ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
- బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడి, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు ప్రకాశ్‌రెడ్డి, మారుతమ్మ జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వన్నూర్‌సాబ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.
- బొమ్మనహాళ్ మండలంలోని సింగానహళ్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, నాయకులు దేవేంద్ర, తిప్పేస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండలంలోని చాబాలలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, సచివాలయ కన్వీనర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండ: 10వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



బెళుగుప్ప: ఎర్రగుడి గ్రామంలో కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

రాయదుర్గం: రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో మే 1న రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రక్తదాతలై.. ప్రాణదాతలుగా నిలవాలన్నారు. ఆపదన సమయంలో మీరిచ్చే రక్తం ఎన్నో ప్రాణాలకు రక్షగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, పార్టీ నాయకులు బోయ మల్లికార్జున, మండల కన్వీనర్ బోయ మంజునాథ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు , కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

3 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటరమణస్వామి, అమ్మవారి మూలవిరాట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు పాలక మండలి చైర్మన్ పాలాక్షిరెడ్డి, గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి శనివారం తెలిపారు. వందేళ్ల నుంచి కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా 8వ తేదీ తొమ్మిదేళ్ల బాలికతో శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు.

శ్రీవారి ఉత్సవ కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 3న కలశ స్థాపన, రక్షా బంధనం, 4న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 5న సూర్యప్రభ వాహనం, 6న శ్రీవారి శేష వాహనోత్సవం, 7న హనుమద్ వాహనం, 8న కల్యాణోత్సవం, గరుడ వాహనోత్సవం, 9న గజేంద్ర వాహనం, 10న మడుగుతేరు, సాయంత్రం రథోత్సవం, 11న పార్వేటోత్సవం, అశ్వ వాహనం, బాణసంచా వేడుక, 12న వసంతోత్సవం, మయూర వాహనం, 13న శయనోత్సవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోండి

కళ్యాణదుర్గం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్లను పూర్తి చేసుకోవాలని ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం హౌసింగ్ డీఈ శైలజ, ఏఈ రామ్మోహన్‌తో కలసి ఆయన హౌసింగ్ సిబ్బంది, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇంటిని నిర్మించుకోవాలన్నారు. ఇప్పటికీ పునాదులు కూడా తీసుకోని వారు వెంటనే పనులు చేపట్టాలన్నారు. బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందకూడదన్నారు.

తూకాల్లో తేడా వస్తే చర్యలు

కళ్యాణదుర్గం: రేషన్ దుకాణాల్లో పేదలకు అందించే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయంలో తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవని సీఎస్‌డీటీ సుబ్రమణ్యం హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు.

1 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఆర్డీటీ క్రికెట్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మే 1 నుంచి ఉచిత సమ్మర్ క్రికెట్ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు కోచ్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల మైదానంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9985344127, 9573555229 నంబర్లను సంప్రదించాలన్నారు.

వేలం మూడోసారీ వాయిదా

రాయదుర్గంటౌన్: దేవదాయశాఖ పరిధిలోని రాణీ ఛత్రం వద్ద టోల్‌గేట్ రుసుం వసూలుకు జరిగిన వేలం ముచ్చటగా మూడోసారి కూడా వాయిదా పడింది. సరైన ధర రాకపోవడంతో ఇప్పటికే రెండు సార్లు వేలం వాయిదా వేయగా ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శనివారం మూడోసారి జరిగిన వేలం కూడా వాయిదా పడింది. ఉరవకొండ ఈఓ రామతులసి, రాయదుర్గం ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట ప్రారంభించారు. గత ఏడాది రూ.8.52 లక్షలకు టోల్‌గేట్ రుసుం వసూలును దక్కించుకున్నారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి సగం డబ్బులు కట్టి చేతులెత్తి డిఫాల్టర్‌గా మారాడు. కాంట్రాక్ట్ గడువు ఏప్రిల్ 30న ముగుస్తుంది. కానీ మూడుసార్లు వేలం వాయిదా పడడంతో టోల్ గేట్ వసూలు చేసే బాధ్యత దేవదాయశాఖ అధికారులపైనే ఉంటుంది.